# దొరుకునా...

నాకు ప్రేమలేఖలు అనే పాత తెలుగు సినిమా పాటలంటే చాల చాల ఇష్టం. హిందీలోనించీ తెలుగులోకి డబ్ చేసిన రాజ్ కపూర్ సినిమా. తెలుగు సినిమాలో ఆ పాటలు విన్న తర్వాతనే సినిమా పాటల సాహిత్యం మీద నాకు అమితమైన గౌరవం ఏర్పడింది.

"పందిట్లో పెళ్ళవుతున్నాదీ కనువిందవుతున్నాదీ", "గోరింటాకూ కోయగబోతే గోళ్ళు కందేనూ", "ఏకాంతమూ, సాయంత్రమూ ఎద నీకై వేచేనూ", "ఘల్లు ఘల్లు ఘల్లు ఘల్లు గజ్జెల సంగీతం" ఇలాటి పాటలు అన్నీనూ. ఈ పాటలు ఎక్కడ వినపడినా అలాగే ఆగిపోయేవాడిని. శంకర్ జైకిషన్ సంగీతం గొప్పగావున్నా జిక్కీ రాజా పాటల్నిఎంతో మధురంగా పాడినా, నన్ను కదలకుండా కట్టిపడేసేది మాత్రం ఆరుద్ర సాహిత్యం. హిందీ బాణీలకి కట్టిన పాటలైనా, ఆ పాటల్లోవున్న అచ్చ తెలుగు ఈనాటి ఎన్ని తెలుగుపాటల్లో కనిపిస్తుంది? ఆరోజుల్లో ఎప్పుడు పడితే అప్పుడు రేడియోలో తెగ వినపడేవి ఆ పాటలు. అదీకాక నా దగ్గర అప్పుడు టేప్ రికార్డర్ కూడా లెదు, కాసెట్ కొనుక్కోవటానికి. అందుకని ఆ పాటల కాసెట్ కొనుక్కోలేదు.

అమెరికా వచ్చేక నాకు ఆ పాటల విలువ ఇంకా బాగా తెలిసింది, మిస్సయేవాడిని కాబట్టి. ఎవరింటికెళ్ళినా ఆ పాటలు వున్నాయా అని అడిగేవాడిని. ఏ షాపుకి వెళ్ళినా ఆ కాసెట్ దొరుకుతుందా అని వెతికేవాడిని. కొంతమంది నా బాధని అర్ధం చేసుకున్నా, చాలమందికి నేనో వెర్రివెంగళప్పలా కనిపించేవాడినేమోనని నాకిప్పటికీ అనుమానం.

ఇండియా వెళ్ళిన ప్రతిసారీ, గుంటూరులోనూ విజయవాడలోనూ బెంగుళూరులోనూ, హైద్రాబాద్‌లోనూ అడుగుతూనే వున్నాను, ప్రేమలేఖలు కాసెట్ వుందా బాబూ అని. ఉంది సార్ అని కొత్త ప్రేమలేఖలు సినిమా కాసెట్ అందించేవారు. వికసించిన నాముఖం వెంటనే వాడిపోయేది.

*   *   *

పంథొమ్మిది వందల డెభ్భైలలో, నేను త్రివేండ్రంలో విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో పదేళ్ళు ఉద్యోగం చేశాను. గోపాలకృష్ణమూర్తి అని తమిళ మిత్రుడుండేవాడు. అతని దగ్గర ఎన్నోగ్రామఫోన్ రికార్డులుండేవి. అవెన్నివున్నా ఆయనకిష్టమైనవి రెండే రకాల పాటలు. ఒకటి కర్ణాటక సంగీతం. బాల మురళి, సుబ్బలక్ష్మి వసంతకుమారి చెంబై.... ఎంతోమంది. నాకు కర్ణాటక సంగీతం మీద ఇష్టం ఎక్కువవటానికి కారణం, బహుశా ఆయన అయుండాలి. ఇక రెండోది. ఇంగ్లీష్ మ్యూజిక్. బీటిల్స్, క్లిఫ్ రిఛర్డ్‌ల బ్రిటిష్ సంగీతం డోరిస్ డే, శామీ డేవిస్ డీన్ మార్టిన్‌లాటివారి అమెరికన్ పాటలేకాక, ఎంగిల్ బర్ట్ హంపర్‌డింక్ ఇలా ఎన్నోపాటలు ఎన్నో గంటలు ఇద్దరం వింటూ ఆనందించేవాళ్ళం. మేము ఆ పాట

లకి చెప్పులు అందిస్తుంటే, మూర్తిగారి అమ్మగారు మాకు నమలటానికి నోటికి జంతికలు అందించేది. (తమిళంలో మురుకులంటారు) నా భాష ఆవిడకీ, ఆవిడ భాష నాకూ అంతగా అర్ధంకాకపోయినా చాల ప్రేమగా వుండేది ఆవిడ.

ఆ రోజుల్లో ఆ పాటలన్నిటిలోనూ నాకు బాగా ఇష్టమైన పాట ఒకటి. ఎవరు పాడారోకూడా తెలియదు నాకు. ఆ పాటకి అర్ధం మనసున్న ప్రతి మనిషినీ కదిలించేదయితే, పాడిన విధానం మన హృదయాలని కరిగిస్తుంది. లెఖ్ఖ పెట్టలే నన్నిసార్లు విన్నాను ఆ పాటని. ఆ పాటలో సాహిత్యం ఇలా వుంటుంది –

Down the way, whether the nights are gay.... and when I reached Jamaica I made a stop. But I am sad to say that I am on my way – I won't be back for many a day. My heart is down, my head is turning around and I have to leave a little girl in Kingston town...

ఈ పాట పేరేమిటో మరిచిపోయాను, ఎవరు పాడారో మరిచిపోయాను. ముప్పై ఏళ్ళు దాటింది మరి. కానీ ఆ లిరిక్ నా మనసులో అలా అతుక్కుపోయింది. ఆ పాటకోసం నా రీశేర్చి అమెరికాలో ఇరవై రెండేళ్ళ క్రితం మొదలయింది. నాట్ కింగ్ కోల్ పాడాడేమోనని నాకు అనుమానం. అందుకని ఆయన పాడిన పాట లన్నీకొని ఓపిగ్గా విని ఈపాట దొరకక నిరుత్సాహపడ్డాను. ఇద్దరు ముగ్గురు అమెరికన్ స్నేహితులని అడిగి చూశాను కానీ వాళ్ళకీ తెలీదన్నారు. పాటలో వెస్ట్ ఇండీస్ గురించి వస్తుంది కనుక, అది అమెరికన్ పాడివుండకపోవచ్చని అప్పట్నుంచీ వెస్ట్ ఇండీస్ మ్యూజిక్ వెతకటం మొదలు పెట్టాను. ఎన్నో సంవత్సరాలు గడిచాయి కానీ ఆ పాట మాత్రం దొరకలేదు.

* * *

ఆయన నా అభిమాన చిత్రకారుడు. సినిమా దర్శకుడు. చేయెత్తి దణ్ణం పెడితే, తనని కాదు ఎవరినో అనుకుని వెనక్కి తిరిగి చూసేటంత నిగర్వి. మన మందరం గర్వించదగ్గ మనిషి. ఆయనతో పరిచయం అవటం నా అదృష్టంన్నర. ఒకరోజున ఉత్తరాల కట్టలో ఆయన ఉత్తరం. ఆయనకి మెహదీ హసన్ సంగీత మంటే ప్రాణం. ఆయన సంగీతమంతా ఈయన దగ్గర వుందిట. మెహదీ హసన్ అబ్బాయి అమెరికాలో వుంటాడని తెలిసింది. ఇంట్లో కచ్చేరీ చేసుకునేటప్పుడు పాడుకునే కొన్నిపాటల టేపులు ఆయన దగ్గరవుండే అవకాశముంది కనుక అవి సంపాదించి పెట్టగలరా అని సారాంశం. నేనుకూడా ఒకసారి కాదు రెండుసార్లు అదే పరిస్థితిలో వున్నాను కాబట్టీ, ఈయనంటే నాకెంతో బోలెడు ఇష్టం కాబట్టీ, ఎలాగైనా సాధించాలని పట్టుబట్టాను. వరుసగా నాలుగు రోజులు ఎంతోమందికి ఫోన్ చేసి మొత్తానికి కావలసిన ఫోన్ నెంబర్ సంపాదించాను. ఫోన్ చేస్తే చివరికి దొరికాడు. ఆయనకూడా పాటలుపాడతాడు. పేరున్న మనిషి. ముక్కూముఖం తెలీని నాతో మాట్లాడరాడనుకోలేదు. ఆయనతో కాసేపు మాట్లాడుతున్నప్పుడే ఆయన మంచివాడు అని తెలిసిపోయింది. ఆ శుభ సందర్భంలోనే, మీ సహాయం కావాలి. ఫలానా ఆయనకి నేను అభిమానిని. ఆయన మీ నాన్నగారికి అభిమా

ని. ఆయన దగ్గర నాన్నగారి పాటలన్నీ వున్నాయి కానీ ఇవి కావాలి. మీరు ఇవ్వాలి ఇవ్వండి అని అడగేశాను.

ఆయన "నా దగ్గర ఎక్కడో ఎప్పటివో ఇలాటివి వుండాలి. కానీ ఎక్కడున్నాయో ఏమిటో... ఆనక పిలవండి" అన్నాడు. సరే ఆనక పిలవమన్నాడు కదా అని రెండురోజులకోసారి ఆనకగా పిలిస్తే రెండు వరాలు టేపుల రూపంలో ఇచ్చాడు. నేనుకూడా అవి వినకుండా, అర్జెంటుగా గురువుగారికి పంపించాను.

* * *

గుంటూరులో అరండెల్‌పేటలో వుంది ఆ షాపు. రెండేళ్ళకొకసారి నేను "ప్రేమలేఖలు" మీద నా ప్రేమ చూపించటం, అదే అదే మళ్ళీ మళ్ళీ అడగటం అతనికీ గుర్తుంది. రెండేళ్ళక్రితం నేను సీడీలు కొనుక్కుంటూ పాత ప్రేమలేఖలు కాసెట్ వుందా అని అడిగాను. "అది మీకింకా దొరకలేదా సార్. ప్రతిసారీ మీరు అడుగుతూనే వున్నారు. వారం రోజులు గడువు ఇవ్వండి. అన్నిచోట్లా వెతికి పట్టుకొస్తాను" అన్నాడు. ఇరవై ఏళ్ళ పైన ఆగాను వారంరోజులు ఆగలేనూ. సరే అన్నాను. ఐదు రోజుల తర్వాత కబురు చేశాడు. టేప్ విజయవాడలో దొరికింది అని. కృతజ్ఞతతో వందరూపాయలు ఇస్తే, ముప్పై ఐదే అని మిగతా డబ్బులు ఇచ్చేశాడు.

* * *

నేను గురువుగారికి టేపులు పంపించిన నెలరోజుల్లో ఆయన దగ్గరినించీ వుత్తరం వచ్చింది. టేపులు అందాయనీ పాటలు విన్నాననీ, కానీ ఆ పాటల వెనక బాగా గొడవగావుంది రికార్డింగ్ అనీ వ్రాశారు. నాకు ఆయన చెప్పిన ఒక్కపనీ సరిగ్గా చేయలేకపోయినందుకు బాధ వేసింది.

* * *

ఆ రోజు ఆఫీసునించీ ఇంటికి వస్తూ, ట్రాఫిక్ ఎక్కువగా వుండి, కార్లు కదలకుండా వుంటే రేడియో పెట్టాను.

" ..... My heart is down, my head is turning around and I have to leave a little girl in Kingston town.... "

పాట అప్పుడే అయిపోయింది. ఆ పాట పేరు కానీ ఎవరు పాడారో కానీ చెప్పలేదు. ఆ పాట వేసే ముందు చెప్పివుంటారు. కాసేపు విలవిల్లాడాను. ఫోన్ చేయటానికి అప్పటికే బాగా ఆలస్యమయింది కనుక, రాత్రికి రాత్రే ఆ రేడియో స్టేషన్‌కి నా బాధంతా వివరిస్తూ ఈమైల్ పంపించాను. మర్నాడు ఆఫీసుకి వెళ్ళగానే నా ఈమైల్‌కి జవాబు కనపడింది. హేరీ బేలఫాంటే అనే అమెరికన్ గాయకుడు పాడిన, "జమైకా ఫేర్‌వెల్" అనే పాట. ఆ రోజు లంచ్ టైమ్‌లో షాపుకి వెళ్ళి అరగంట వెతికాను. కనపడలేదు. చివరికి అక్కడ పనిచేసే అమ్మాయి, కంప్యూటర్లో చూసి "లోపల స్టాక్‌రూంలో వుంది" అని తీసుకువచ్చింది. ఎగిరి గంతేసి ఆ అమ్మాయికి షేక్‌హేండ్ కౌగలింతో ఇచ్చి, కార్లో ఆ పాట పెట్టుకుని వింటూ ఆఫీసుకి వెళ్ళాను. ఎన్నో దశాబ్దాల తర్వాత మళ్ళీ పాట వింటున్నప్పుడు అనిపించింది, ఎంత ఎంత ఎడమైతే అంత తీపి కలయిక అని.